క్లుప్తంగా

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



లావేటిపాలెంలో వైద్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది

లావేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు అన్నారు. అదపాక, లావేటిపాలెం గ్రామాల్లో శనివారం ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీపీ, సుగర్‌తో పాటు పలు వైద్య తనిఖీలు ఉచితంగా చేసి మందులు అందించారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ పెట్టుకోవాలి



హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజేష్

రణస్థలం: ద్విచక్ర వాహనాదారులు విధిగా హెల్మెట్ ధరించాలని జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ అన్నారు. గిరిజాలపేట రహదారిపై శనివారం ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ పెట్టుకోకుండా వాహనం నడిపితే అపరాధ రుసుం విధిస్తామన్నారు. బైక్ అదుపు తప్పి పడిపోతే తలకు హెల్మెట్ రక్షణ కల్పించి పెను ప్రమాదం నుంచి కాపాడుతుందని అవగాహన కల్పించారు. పరిమితికి మించి బైక్‌పై ప్రయాణించరాదని సూచించారు.

మండల దీక్షలు ప్రారంభం



దీక్షలు స్వీకరించిన హరినామ భక్త బృందం

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని హరేరామ మందిరంలో భక్త బృందం ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన మండల దీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. భాద్రపద బహుళ అమావాస్య నుంచి నవంబరు 24 కార్తిక శుద్ధ ఏకాదశి వరకు 41 రోజుల పాటు దీక్షలు జరుగుతాయని భక్త బృందం ప్రతినిధులు పేర్కొన్నారు. 50ఏళ్లుగా దీక్షలు కొనసాగుతున్నాయని చెప్పారు. ముగింపురోజు 24 గంటల పాటు హరినామ సంకీర్తనలు, ద్వాదశి నాడు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.


రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సత్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ఎచ్చెర్ల పోలీసులు శనివారం చిలకపాలెం కూడలిలో ఫ్లైఓవర్ కింద వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలకు కారణాలు వివరించారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి, అతివేగంగా వాహనాలు నడపవద్దని, సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. వాహన చోదకులు తలకు గాయాలు కావటం వల్ల ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన



జిల్లేడు ద్రావణం తయారు చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: వరిలో తెగుళ్ల నివారణకు జిల్లేడు ద్రావణం బాగా పని చేస్తోందని నేచరల్ యూనిట్ ఇన్‌చార్జి రాజేష్ అన్నారు. జగన్నాథవలస గ్రామంలోని సిరుగుడ శంకరరావు వరి క్షేత్రంలో జిల్లేడు ద్రావణం తయారీపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు లభించే సహజ వనరులను వినియోగించి వివిధ రకాల ద్రావణాలు, కషాయాలను తయారు చేసుకుంటే సుస్థిర వ్యవసాయంతో సురక్షిత ఆరోగ్యం సాధించుకోవచ్చన్నారు.

పాలనలో మార్పు గమనించాలి

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- కొత్తూరు–సైరిగాంలో గడపగడపకు మన ప్రభుత్వం



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పరిపాలనలో వచ్చిన మార్పును గమనించాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శనివారం కొత్తూరు– సైరిగాం గ్రామంలో ఎంపీపీ గొండు రఘురాం అధ్యక్షతన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నరేళ్లు అవుతోందని, అమలు చేసిన కార్యక్రమాలపై అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రతి ఇంటికీ వస్తున్నట్లు తెలిపారు. లంచాలకు తావు లేకుండా పథకాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏ పని జరగాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ప్రస్తుతం పరిపాలనను మీ గ్రామంలోకే తీసుకువచ్చామన్నారు. ప్రతిపక్షాలకు ఏం చెప్పాలో తెలియక ధరలు పెరిగాయని చెబుతున్నారని దుయ్యబట్టారు. ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్‌లో మన వారు ఉంటే ధరలు కనుక్కోవాలని, దేశమంతటా ఒకే ధరలు ఉన్నాయని చెప్పారు. రెండేళ్లు కరోనా కాలంలో ప్రభుత్వం తొమ్మిది సార్లు వలంటీర్ల ద్వారా ఇళ్లకే బియ్యం అందజేసిందని గుర్తు చేశారు. వలంటీరు వ్యవస్థను తీసేయమని ప్రతిపక్షాలు అంటున్నాయని, మీరేం అంటారని ప్రజలను అడగ్గా, అవగాహన లేని వారు అలానే అంటారని సమాధానం వచ్చింది. చాలా రాష్ట్రాలు మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నాయని ధర్మాన చెప్పారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులన్నీ భర్తీ చేశామన్నారు. ఒకప్పుడు పెద్దాసుపత్రికి వెళితే వెంటనే వైజాగ్ రిఫర్ చేసేవారని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. అధునాతన యంత్రాలు, వైద్యులతో పాటు 900 బెడ్లు అందుబాటులోకి ఉంచామని చెప్పారు. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చామన్నారు. బూట్లు, దుస్తులు, పుస్తకాలు, నాణ్యమైన భోజనంతో పాటు నాడు–నేడు పథకంతో బడుల రూపురేఖలు మార్చామని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. అన్ని రకాల పరీక్షలతో పాటు 175 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నామన్నారు. 14 ఏళ్లలో చంద్రబాబు చేయలేని పని వైఎస్ జగన్‌మోహనరెడ్డి జిల్లా రైతాంగానికి చేశారని చెప్పారు. నేరడి ప్రాజెక్టుపై ఒడిశాతో ఇబ్బంది ఉంటే ఒక్కరోజు కూడా చంద్రబాబు మాట్లాడలేదన్నారు. అదే జగన్‌మోహన్‌రెడ్డి ఒక మెట్టు దిగి ఒడిశా ముఖ్యమంత్రిని కలిసి సమస్య వివరించారని తెలిపారు. ఇంకా ఆలస్యమై ఉంటే రూ.175 కోట్లతో ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని రిజర్వాయర్‌కు పంపిస్తున్నట్లు వివరించారు. ఆ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. వచ్చే ఏడాది రబీలో వంశధార నీరు అందుతుందన్నారు. నెల రోజుల నుంచి వర్షం పడలేదని, రిజర్వాయర్‌లో ఉన్న ప్రస్తుతం నీరు విడిచిపెట్టి పంటలను కాపాడాలని ఎస్ఈని ఆదేశించామన్నారు.

యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పథకాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఒక్క ఈ పంచాయతీలోనే రూ.11.50 కోట్లు అందజేసినట్లు వెల్లడించారు. గ్రామానికి రోడ్లు, వంశధార నీరు తెచ్చింది మంత్రి ధర్మానేనని గుర్తు చేశారు. గ్రామంలో అభివృద్ధిని అడ్డుకునేందుకు టీడీపీ నాయకులు కోర్టులకు వెళ్లడం దారుణమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, సర్పంచ్ మార్పు రమణమూర్తి, ఎంపీటీసీ పాదిలాపు శ్రీరాములు, పార్టీ మండల అధ్యక్షుడు పీస గోపి, అంబటి శ్రీనివాసరావు, ముంజేటి కృష్ణమూర్తి, పీస శ్రీహరిరావు, కొయ్యాన నాగభూషణం, మార్పు పృథ్వీరాజ్, గొండు జయరాం, యాళ్ల నారాయణమూర్తి, సుంకాన సురేష్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

బోడెమ్మకోవెలలో నవ చండీయాగం



సిద్ధమైన హోమ గుండం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గోల్కొండ రేవు రోడ్డులో ఉన్న ఉమాజీవేశ్వరస్వామి దేవాలయం(బోడెమ్మ కోవెల)లో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 10 రోజుల పాటు శక్తి పంచాయతన సహిత నవ చండీయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీన సాయంత్రం 4 గంటల నుంచి యాగం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రోజుకొక అవతారంలో అమ్మవారిని అలంకరించి నైవేద్యాలు, పూజలు నిర్వహిస్తామని చెప్పారు. 25న మహాపూర్ణాహుతితో యాగం ముగుస్తుందన్నారు. భక్తులంతా పాల్గొనవచ్చని తెలిపారు. రంగాభట్ల శ్రీనివాస శర్మ, ముక్కవిల్లి సూర్యప్రకాశ శర్మ, మంధెన్న లక్ష్మీనారాయణ శర్మల ఆధ్వర్యంలో యాగం జరుగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా ఈ నెల 22న అభయాంజనేయస్వామి, దక్షిణామూర్తిల విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు గంధం వెంకటరావు, ఉమామహేశ్వరరావు, కమిటీ సభ్యులు బి.వెంకటరావు, టి.చంద్రశేఖర్, టి.ఇ.రవీంద్ర, సీహెచ్ గాంధీ, బి.లక్ష్మణరావు, బి.రవిరెడ్డి, రాయి చంద్రశేఖర్, వై.ప్రసాద్, బి.కృష్ణ, జి.కొర్లయ్య పాల్గొన్నారు.

రైతన్నకు కలిసొచ్చిన మొక్కజొన్న



పెద్ద సైజులో దిగుబడి వచ్చిన మొక్కజొన్న కండెలు

జి.సిగడాం: మొక్కజొన్న పంట ఈ ఏడాది రైతులకు కలిసి వచ్చింది. ఏటా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్క జొన్న పంట రైతు చేతికి అందక నానా ఇబ్బందులు పడేవారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఎక్కువగా తుఫాన్లు, అకాల వర్షాలతో పంట చేతికి రాక రైతులు నష్టపోయేవారు. అరకొరగా వచ్చిన పంట కూడా రంగుమారడంతో జొన్నలను కొనుగోలు చేయడానికి వ్యాపారస్తులు ముందుకు వచ్చేవారుకాదు. ఈ ఏడాది మాత్రం భారీ వర్షాలు లేక పోవడం, సాధారణ వర్షాలతో మొక్కజొన్న పంట రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికే రైతులు పంటను పూర్తిగా తమ కల్లాల్లోకి తెచ్చుకున్నారు. కొంతవరకు దిగుబడి తగ్గినా పంట ఇంటికి చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జి.సిగడాం మండలంలోని 20 గ్రామాల్లో సుమారు ఏడు వేల ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారు. సీతంపేట, గేదెలపేట, నక్కపేట, పెంట, పాలఖండ్యాం, జాడ, డీఆర్‌వలస, నడిమివలస, బాతువ, జగన్నాథవలస, జి.సిగడాం గ్రామాల్లో ఎక్కువ విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేశారు. ఎకరాకు సుమారు 20 నుంచి 25 బస్తాల వరకు దిగుబడి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

- ముస్తాబైన ఆలయాలు



లావేరులోని కనకదుర్గ ఆలయానికి ఏర్పాటు చేసిన లైటింగ్



బాకర్‌సాహెబ్‌పేటలోని దుర్గా మహాలక్ష్మీ అమ్మవారు



ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ

లావేరు: శరన్నవరాత్రి ఉత్సవాల కోసం దుర్గాదేవి ఆలయాలు ముస్తాబయ్యాయి. లావేరులోని కనక దుర్గ ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని ఆలయ ధర్మకర్త, శ్రీకాకుళం తహసీల్దార్ నిడిగంట్ల వెంకటరావు, ఆలయ అర్చకుడు నేతేటి రుషికుమార్‌శర్మ చెప్పారు. అలాగే బుడుమూరు, లావేరు, చినమురపాక, అదపాక, బొంతుపేట గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, దుర్గాదేవి విగ్రహాలు ఏర్పాటుకు కోసం యువకులు, గ్రామస్తులు మండపాలు ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజులుపాటు అష్టదళ పద్మారాధన, విశేషదీపాలంకరణ, సహస్ర కుంకుమార్చనలు, సువాసిని పూజలు, సహస్ర తమల పత్రార్చనలు, సహస్ర కమలపుష్పార్చన, విద్యార్థులకు సరస్వతీ పూజలు, శత్రుదోష పరిహారం అర్చనలు, సహస్ర రంభా పత్రార్చనలు, శ్రీచక్ర పూజలు, విజయం చేకూరుటకు విశేష పూజలు, హోమ పూజలు ఉంటాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.


ఎచ్చెర్ల మండలంలో..

ఎచ్చెర్ల క్యాంపస్: ఆలయాల్లో, గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో శరన్నవరాత్రులు నిర్వహణకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎచ్చెర్ల, కుశాలపురం, కొయ్యాం గ్రామాల్లో మండపాలు ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నారు. మరో పక్క కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలోని రాజరాజేశ్వరి ఆలయంలో, కుశాలపురంలో దుర్గా మహేశ్వర ఆలయంలో, కె.కె.పేటలోని లితాదేవి ఆలయంలో, ఫరీదుపేట కొయ్యరాళ్లలోని దుర్గాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శ్రీకాకుళం నగరంలో..

శ్రీకాకుళం కల్చరల్: శరన్నవరాత్రి ఉత్సవాలకు నగరంలోని దేవీ ఆలయాలు, మండపాలు ముస్తామయ్యాయి. విద్యుత్ దీపాల అలంకరణలతో ఆకట్టుకుంటున్నాయి. శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలిలో జయదుర్గా టాక్సీ స్టాండ్, డే అండ్ నైట్ కూడలి శ్రీనవదుర్గా టాక్సీస్టాండ్, ఏపీహెచ్‌బీ కాలనీ, టౌన్‌హాలులో రాజస్థానీ మిలన్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయం, పాత బ్రిడ్జి వద్ద కనక దుర్గాదేవి ఆలయం, పెద్దబరాటం వీధిలోని నీలమ్మతల్లి ఆలయం, పీఎస్‌కాలనీలోని వరద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో ఉన్న శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారు, కాకివీధిలో వెలసిన ముత్యాలమ్మ తల్లి ఆలయం, నానుబాలవీధిలోని విజయదుర్గా అమ్మవారి ఆలయం, నక్కవీధిలోని ఉమాజలలేశ్వరస్వామి ఆలయం, గుడివీధిలోని ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయంలో వెలసిన శ్రీరాజరాజేశ్వరీదేవి, బాకర్‌సాహెబ్ పేటలోని దుర్గామహాలక్ష్మీదేవి ఆలయం, గోవింద నగర్ కాలనీలోని శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయం, మంగువారితోటలోని కామక్షమ్మదేవి ఆలయాలను ఉత్సవాలకు సిద్ధం చేశారు. గుడివీధిలోని వేద మాత గాయత్రి నిలయం, గుజరాతిపేటలోని రాజరాజేశ్వరీ దేవీపీఠం, కత్తెరవీధిలోని శ్రీరాజరాజేశ్వరీ దేవి పీఠం, గాజుల వీధిలోని అమ్మవారి పీఠంలోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వెంకన్నకు విశేష పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అష్టోత్తరశతనామాలు, భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. వెంకట రామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు.

యాదవులను బీసీ–బీలో చేర్చాలి



ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి వినతిపత్రం అందిస్తున్న యాదవ సంఘం నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఉత్తరాంధ్రలో యాదవులను బీసీ–బీలో చేర్చాలని ఎమ్మెల్సీ, యాదవ సంఘం అధ్యక్షుడు నర్తు రామారావు కోరారు. ఈ మేరకు శనివారం విశాఖపట్నంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన యాదవుల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వమ్మి సన్యాసిరావు, గొంప అప్పారావు యాదవ్, ముచి రామలింగం యాదవ్, మాన్యాల కృష్ణారావు, సత్యాలత, రమణయాదవ్, గద్దిబోయిన కృష్ణయాదవ్, చిన్ని జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి క్షీరాభిషేకాలు



గుడివీధిలోని రాజరాజేశ్వరికి అభిషేకాలు



పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధిలో ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయంలో పోలాల అమావాస్య సందర్భంగా రాజరాజేశ్వరీ దేవివి శనివారం క్షీరాభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. లలితా చండీ హోమం తొమ్మిది రోజులు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం లలితా సంఘం ఆధ్వర్యంలో మహిళలు సామూహిక లలితాసహస్ర నామ పారాయణ చేశారు.

ఇళ్లల్లో పోలాల అమావాస్య పూజలు

భాద్రపద బహుళ అమావాస్య పోలాల అమావాస్య కావడంతో గృహాల్లో మహిళలు ప్రత్యేక నిర్వహించారు. మహాలక్ష్మీ అమ్మవారిగా వరిదుబ్బు, కంద మొక్కలను ఏర్పాటు చేసి నైవేద్యం సమర్పించారు.

వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలి

ఎచ్చెర్ల: ఆరోగ్య సబ్‌సెంటర్లలో పనిచేస్తున్న వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని ఎచ్చెర్ల పీహెచ్‌సీ వైద్యుడు కిశోర్‌కుమార్ అన్నారు. సిబ్బందితో తన కార్యాలయంలో శనివారం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ఆటో– స్కూటీ ఢీ

- ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని 80 ఫీట్ రోడ్డులో శేషగిరిరావు ఆస్పత్రి సమీపంలో శనివారం రాత్రి ఆటో, స్కూటీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు, రిమ్స్ ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. నగరంలోని అనంతపల్లి వీధికి చెందిన పొట్నూరు నాగేశ్వరరావు వాకింగ్ కోసం స్కూటీపై 80 ఫీట్ రోడ్డుకు వచ్చి తిరిగి వెళ్తుండగా కలెక్టర్ ఆఫీసు నుంచి జెడ్పీ వైపు వెళ్తున్న ఆటో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న ఇప్పిలి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికురాలు ఈశ్వరమ్మకు కూడా గాయాలయ్యాయి. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు.

మిత్ర పురుగులను కాపాడుకోవాలి

నరసన్నపేట: పంటలకు మేలు చేసే మిత్ర పురుగులను కాపాడుకోవాలని సెంచూరియన్ యూనివర్సిటీ వ్యవసాయ విభాగం విద్యార్థిని పిన్నింటి హేమలత అన్నారు. నరసన్నపేట, తామరాపల్లి, జమ్ము ప్రాంతాల్లో రైతులకు హేమలతతో పాటు ఇతర విద్యార్థులు మిత్ర పురుగలతో చేకూర నున్న లబ్ధిపై శనివారం అవగాహన కల్పించారు. పొలాల్లో రెండు రకాల పురుగులు ఉంటాయని అన్నారు. కొన్ని పంటలకు హాని కలిస్తాయని, మరికొన్ని మేలు చేస్తాయన్నారు. పొలాల్లో క్రిమి సంహారక మందులు వినియోగం తగ్గించి సస్యరక్షణ విధానాలు పాటించడం ద్వారా మిత్ర పురుగులను కాపాడుకోవచ్చని వివరించారు. అలాగే పొలాల్లో పసుపు జిగురు అట్టలు వినియోగం ద్వారా మిత్ర పురుగులను కాపాడుకోవచ్చని తెలిపారు.

నాబార్డ్ నిధులతో వెయిటింగ్ హాల్

- పెదపాడు బాలికల అంబేద్కర్ గురుకులం వద్ద నిర్మాణం
- తల్లిదండ్రులతో విద్యార్థులు మాట్లాడుకునేలా వెసులుబాటు



పెదపాడు బాలికల అంబేద్కర్ గురుకులం వద్ద నిర్మించిన వెయింటి హాల్



వెయిటింగ్ హాలులోని బల్లలు

శ్రీకాకుళం రూరల్:

నాబార్డ్ నిధులతో వెయిటింగ్ హాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పెదపాడులోని బాలికల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పాఠశాలకు వచ్చే తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడేందుకు ఇక్కడ గతంలో ఎలాంటి ఏర్పాట్లు ఉండేవి కావు. చెట్లు, గేటు, సెక్యూరిటీ రూమ్ తదితర ప్రాంతాల్లో నిల్చుని పిల్లలతో మాట్లాడాల్సి వచ్చేది. పండగ, పర్వదినాలు సమయంలో పిల్లలను చూసేందుకు వచ్చినప్పుడు పిండివంటలు అందివ్వడమే తప్ప తినిపించేందుకు సరైన వేదిక ఉండేది కాదు. ఈ నేపథ్యంలో స్కూల్ యాజమాన్యం నాబార్డ్ నిధులతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెండు సైన్సు ల్యాబ్‌లు కట్టగా మిగిలిన సొమ్ము నుంచి తల్లిదండ్రుల వెయిటింగ్ హాల్ కట్టేందుకు నిర్ణయించారు. ఇందుకు నాబార్డ్ ప్రతినిధులు కూడా అంగీకరించారు. హాలుతో పాటు కొన్ని సిమెంట్ టేబుల్స్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు.

తుది దశకు పనులు..



మా స్కూల్లో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ 578 మంది పిల్లలు చదువుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలను చూసేందుకు వచ్చేటప్పుడు ఆరుబయటే ఉంటూ ఇబ్బందులు పడేవారు. దీంతో మాకు మంజూరైన బిల్డింగ్స్ ఫండ్ నుంచి వెయింట్ హాల్ కడుతున్నాం. పనులు చివరిదశకు చేరుకున్నాయి. ఈ నెలాఖరు నాటికి ప్రారంభిస్తాం.

– జ్యోతి, ప్రిన్సిపాల్, అంబేద్కర్ గురుకులం